నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | సోమవారం 19 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



## అపూర్వ సమ్మేళనం

అపూర్వ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

*జన్నాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-2008కు చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు ఉమాబాల, శరత్, లక్ష్మణ్, వెంకటరమణ పాల్గొన్నారు. - ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 18*



మాకులపేట కడెం ప్రధాన కాలువ పక్కన రెయిలింగ్ లేని వంతెన

# ఆ బ్రిడ్జిలపై భద్రం!

## ప్రమాదాలకు కేరాఫ్‌గా కడెం ప్రధాన కాలువపై నిర్మించిన వంతెనలు

- ఏళ్లకేళ్లుగా మరమ్మతులు కరువు
- ప్రాణాలు పోతున్నా పట్టింపు లేదు
- గతేడాది ట్రాలీ బోల్తాపడి ఒకరి మృతి.. పలువురికి గాయాలు
- ఇటీవల బోల్తా పడ్డ ధాన్యం ట్రాక్టర్

దండేపల్లి, మే 18 : మంచిర్యాల జిల్లాలోని కడెం ప్రధాన కాలువపై నిర్మించిన పలు వంతెనలు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. కడెం జలాశయం ప్రధాన కాలువకు ఇరువైపులా రహదారి నిర్మించారు. మధ్యలో వాగులు అడ్డంగా ఉన్నచోట వంతెనలు నిర్మించారు. ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయగా, వాటికి ఏర్పాటు చేసిన ఇనుప గొట్టాలు దొంగల పాలయ్యాయి. కేవలం రాడ్లు మాత్రమే మిగిలి ఉండి ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారి గుండా నిత్యం వేలాది మంది రైతులు, కూలీలు ప్రయాణిస్తుంటారు. ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు కడెం కాలువ, వాగులో పడిపోయే అవకాశముంది. ఇక్కడ పలువురు గాయపడ్డ ఘటనలు ఉన్నాయి. గతేడాది దండేపల్లి మండల కేంద్రానికి చెందిన ఉపాధి కూలీలు వెళ్తున్న ట్రాలీ కడెం ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువలో పడిపోగా, ఓ మహిళ చనిపోవడంతో పాటు పలువురు గాయపడ్డారు. అలాగే ఇటీవల వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో ధాన్యం నేలపాలైంది. పెద్ద ప్రమాదం తప్పింది.

### ఈ దారి గుండా ప్రయాణించేది రైతులే..

దండేపల్లి మండలం తాళ్లపేట, రాజుగూడ, మాకులపేట, దమ్మన్నపేట, లింగాపూర్, తానిమడుగు వద్ద ఉన్న వంతెనలతో పాటు మిగతా చోట్ల ఉన్న బ్రిడ్జిలను సైతం మరమ్మతులు చేయాల్సిన అవసరముంది. కడెం ప్రధాన కాలువకు అవతలి వైపు అటవీప్రాంతం, ఇటువైపు పొలాలు ఉన్నాయి. అటవీప్రాంతంలో పలుచోట్ల పొలాలు కూడా ఉన్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు ద్విచక్ర వాహనాలు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై నిత్యం ఈ రూట్లో ప్రయాణిస్తుంటారు. అవతలి వైపుకు వెళ్లాలన్నా ఇదే ప్రధాన మార్గం. అలాగే కడెం ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు ఈ దారిగుండా రాకపోకలు కొనసాగిస్తుంటారు. గూడాల నుంచి కడెం ప్రధాన కాలువ దాటుకొని రావాలంటే ఈ దారిగుండానే రాకపోకలు కొనసాగించాల్సిందే. దీనికి తోడు రహదారి మార్గం కూడా అధ్వానంగా ఉండడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన వంతెనలతో పాటు, రహదారులకు మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



తాళ్లపేట సమీపంలో వాగుపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా ఊడిపోయిన ఇనుపగొట్టాలు

| | | |
|---|---|---|
| కడెం ప్రధాన కాలువ వెంబడి ఉన్న వంతెనలు | 20 | |
| కాలువను ఆనుకొని ఉన్నగ్రామాలు | 40 | |
| డిస్ట్రిబ్యూటరీ కాల్వలు | 42 | |
| ప్రధాన కాలువ పొడవు | 72 | కి.మీ. |
| నిత్యం ఈ రూట్లో ప్రయాణించే రైతులు, కూలీలు | 20 | వేల మంది |



మాకులపేట సమీపంలో రక్షణ దిమ్మెలు లేని వంతెన

## బాటం యాష్ నిరంతరం సరఫరా చేయాలి



ఎస్టీపీపీలో నిర్వహించిన సమావేశంలో అధికారులు

జైపూర్, మే 18 : జైపూర్ ఎస్టీపీపీలో ఉత్పత్తి అవుతున్న యాష్ వినియోగంపై ఆదివారం అధికారులు సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, ఆయా ఏరియాల ప్రాజెక్టు అధికారులు, ఏజెంట్‌లు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ, ఎస్సార్పీ-3, ఆర్‌కే-7 గనులకు కావాల్సిన బాటం యాష్ రవాణాకు సంబంధించిన విషయాలపై చర్చించారు. పైన పేర్కొన్న భూగర్భ గనులకు నిరంతరం బాటం యాష్ సరఫరా చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఈడీ సూచించారు. కార్యక్రమంలో ఆర్‌కే-7 గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఇందారం ఓపెన్ కాస్టు ప్రాజెక్టు అధికారి ఏ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సార్పీ-1 గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఎస్టీపీపీ అధికారులు ప్రభాకర్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



జన్నారం : ఇందన్‌పెల్లి రేంజ్ అడవిలోని వాగులో ఏర్పాటు చేసిన చెలిమ

## వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు..

**వేసవి నేపథ్యంలో సహజసిద్ధంగా నీటి సౌకర్యం కల్పిస్తున్న అటవీశాఖ**

- ర్యాంప్‌వెల్స్‌తో పాటు చెలిమెలు ఏర్పాటు
- సోలార్ పంపుల ద్వారా చెరువులు, కుంటలు నింపుతున్న అధికారులు



జన్నారం డివిజన్‌లోని అడవుల్లో వన్యప్రాణుల కోసం సోలార్ పంపుద్వారా కుంటలో నీటిని నింపుతున్న అధికారులు

### నీటి వసతులు కల్పించాం

*వేసవిలో దాహార్తిని తీర్చుకునేందుకు అడవి జంతువులు సమీప గ్రామాల్లోకి వెళ్లి ప్రమాదాల బారిన పడుతుంటాయి. ఇందులో భాగంగానే కవ్వాల్ టైగర్ రిజర్వుడు ఫారెస్టులో తాగు నీటికి ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రతి కిలో మీటర్ పరిధిలో సహజసిద్ధమైన నీటి వసతులు కల్పించాం.*

**- కారం శ్రీనివాస్, ఇందన్‌పెల్లి రేంజ్ ఆఫీసర్**

జన్నారం, మే 18 : వేసవి నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అటవీశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ మేరకు కవ్వాల్ టైగర్ రిజర్వుడు ఫారెస్టులో సహజసిద్ధంగా తాగు నీరందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నది. వాగుల్లో చెలిమెలు, ర్యాంప్‌వెల్స్ వంటివి ఏర్పాటు చేస్తూనే.. సోలార్ పంపుల ద్వారా కుంటలు, చెరువుల్లో నీటిని నింపుతూ అటవీ జంతువుల దాహార్తిని తీర్చుతున్నది. ఇప్పటికే డివిజన్‌లోని ఇందన్‌పెల్లి, జన్నారం, తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని 40 బీట్లలో వన్యప్రాణుల తాగు నీటికోసం సౌకర్యం కల్పించింది. ఐదు చోట్ల సహజసిద్ధమైన నీటి వనరులు ఏర్పాటు చేసింది. 29 సోలార్ పంపులు, 30 ర్యాంప్‌వెల్స్, 187 కుంటల ద్వారా నీటి వసతులు కల్పిస్తున్నది. వేసవిలో వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకునేందుకు అటవీ సమీప గ్రామాల్లోకి వచ్చి ప్రమాదాల బారిన పడుతుండగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.



జన్నారం : ఇందన్‌పెల్లి రేంజ్‌లోని అడవిలో ఏర్పాటు చేసిన ర్యాంప్‌వెల్

## కాగజ్‌నగర్‌లో దోస్త్ సహాయక కేంద్రం

కాగజ్‌నగర్, మే 18 : ప్రభుత్వ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలు పొందే విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా స్థాయి దోస్త్ సహాయక కేంద్రాన్ని(హెల్ప్ లైన్ సెంటర్) ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాల విషయంలో ఏవైనా సాంకేతిక సమస్యలుంటే సహాయక కేంద్ర సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం 7013607011, 9440194179లో సంప్రదించాలని సూచించారు.

## పులిని హతమార్చిన కేసులో విచారణ

దహెగాం, మే 18 : పెంచికల్‌పేట్ అడవుల్లోని ఎల్లూరు అటవీ ప్రాంతంలో ఏడేళ్ల వయసున్న ఆడపులికి విద్యుత్ షాక్ పెట్టి హతమార్చిన విషయం విదితమే. ఈ కేసు విచారణలో భాగంగా పలువురు అటవీశాఖ అధికారులు దహెగాం మండలం ఖర్జీ,గెర్రె,చిన్నరాస్పల్లి, ఒడ్డుగూడ, దహెగాంకు చెందిన సుమారు 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విచారణ తర్వాత వారిని వదిలేసినట్లు సమాచారం?. కొందరి సెల్‌ఫోన్‌లను అధికారుల వద్దే ఉంచుకొన్నట్లు తెలుస్తున్నది. కాగా, ఓ వ్యక్తిని మాత్రం తమ అదుపులోనే ఉంచుకొని విచారణ చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కాగా, 2021లో మహారాష్ట్ర పెద్దపులి మృతి చెందగా, అప్పుడు కూడా ఓ గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.



పులి కళేబరాన్ని ఖననం చేస్తున్న అటవీ అధికారులు (ఫైల్)

## కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 18 : 2025-26 విద్యాసంవత్సరానికిగాను ప్రైవేట్-కార్పొరేట్ కళాశాలల్లో (ఇంటర్‌తో పాటు ఎంసెట్ కోచింగ్) ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సజీవన్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో 7-జీపీఏ కంటే ఎక్కువ వచ్చిన షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలు/వెనుకబడిన తరగతులు/ఈబీసీ/మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్, ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, నవోదయ, ఆదర్శ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, తప్పనిసరిగా ఏడేళ్ల స్టడీ సర్టిఫికెట్లు, మీ సేవ నుంచి పొందిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పదో తరగతి మెమో, ఆధార్, రేషన్ కార్డులు అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

## బర్రెల మృతితో ఉపాధి కోల్పోయాం న్యాయం చేయాలి

- విద్యుత్ తీగలు అమర్చి వాటి మృతికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి
- అమరావాది రైతుల డిమాండ్
- ఆర్కేపీలో కోల్‌బెల్ట్ రహదారిపై ధర్నా



న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న రైతులు

రామకృష్ణాపూర్, మే 18 : కూరగాయల తోటకు కంచెగా విద్యుత్ తీగలు అమర్చడం వల్ల 13 బర్రెల మృతి చెందాయని, ఇందుకు కారణమై వ్యక్తిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పశువుల యజమానులు (పాడి రైతులు) డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆర్కేపీ ఏరియా హాస్పిటల్ వద్ద కోల్ బెల్ట్ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రామకృష్ణాపూర్‌లోని అమరావాది చెరువు సమీపంలో కూరగాయలు సాగు చేస్తున్న ఓ రైతు.. కంచెగా చుట్టూ విద్యుత్ తీగలను అమర్చడం వల్ల 13 బర్రెలు మృత్యువాతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. బర్రెలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, తమకు తగిన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని పాడిరైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

### మూగ జీవాల మృత్యువాత

కన్నెపల్లి/జైనూర్, మే 18 : మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం మెట్‌పల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ఆదివారం విద్యుత్‌షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది. మెట్‌పల్లికి చెందిన సీడం గంగారాంకు చెందిన ఎద్దు మేత కోసం వెళ్లిన సమయంలో మరో ఎద్దుతో పోట్లాడింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అది తగలగా, షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని, అధికారులు తనకు నష్టపరిహారం అందించాలని రైతు కోరాడు. ఇక కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పొలాసకు చెందిన రైతు ఆడే ప్రేమ్‌సింగ్ తన ఆవును మేత కోసం విడిచిపెట్టాడు. స్థానికంగా ఉన్న టవర్ డీటీఆర్ ఎర్త్ ఆవుకు తగలగా.. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రేమ్‌సింగ్ వేడుకుంటున్నాడు.